# సమానాంతరరేఖలు

టెలిఫోన్ గణగణమంది -

ఓ సీరియస్‌కేస్ చూశాక పదినిమిషాల క్రితమే తిరిగి వచ్చాను. విసుగ్గా రిసీవరు అందుకున్నాను.

అవతల నుండి కేశవరావు పరిచితకంఠం వినపడింది.

'హలో డాక్టరు గారూ! ప్రశాంతంగా వున్న సముద్రంలో హఠాత్తుగా తుఫాను వీచినట్టు -నిశ్చలజలంలో మట్టిబెడ్డ విసిరినట్టు అయింది నా పరిస్థితి -'

ఆ మాటల్ని జీర్ణించుకోటానికి కాలవ్యవధి యిస్తున్నట్లు కొంతసేపు నిశ్శబ్దం - కేశవరావు తత్వమే అంత. మొదట్నుంచీ అతనికి కవిత్వమంటే కొంత పిచ్చి వుంది. వీలైనప్పుడల్లా వుపమానాలు జతచేసి వున్న విషయాన్ని డొంక తిరుగుడుగా చెప్తాడు.

'సుందరం నిన్న సాయంత్రం వచ్చాడు. అతను వంటరిగా వస్తే బాగానే వుండును. జ్వరంతో వచ్చి మమ్మల్ని వణికిస్తున్నాడు. మీకు శ్రమ కలిగిస్తున్నందుకు క్షమించండి. వెంటనే బయలు దేరిరండి. మీకోసం ఎదురు చూస్తుంటాను.'

నవలల్లో మాదిరిగా, జీవితంలో సస్పెన్సు వుంటేనే కాని రక్తి కట్టదు. సుందరం ఎందుకు వచ్చాడు? అతని మనస్తత్వంలో ఎలాంటి మార్పులు వచ్చాయి ? ఇలాంటి ప్రశ్నలు బుసలు కొడుతున్న నాగుల్లా తలెత్తాయి. వాటికి సమాధానం వెంటనే లభిస్తే పొంగుతున్న పాల మీద నీళ్ళు జల్లినట్టు ఉత్సాహం, ఆసక్తి నశించిపోతాయి. మెడిసిన్ చెస్టు సర్దుకుని అరుగుమీదకొచ్చాను. ఊహాగానంలో మునిగివున్న డ్రైవరు కాలుస్తున్న బీడీ దూరంగా విసిరివేసి గబగబా వచ్చి డోర్ ఓపెన్ చేశాడు. సుజాత తలుపు వేసుకోటం - నేను బయలుదేరటం - ఒక్కసారే జరిగాయి. కారు దీపాల్తో కళకళలాడుతున్న వీధులన్నీ దాటి చీకటి గుండా దూసుకుపోయి కేశవరావుగారి ఇంటిముందు ఆగింది.

తిన్నగా హాల్లోకి వెళ్ళాం. సుందరం ఇంకా వణుకుతూనే వున్నాడు. టెంపరేచర్ 103

డిగ్రీలు వుంది. రుక్మిణి వేడినీళ్ళు తీసుకొచ్చింది. ఇంజక్షనిచ్చాను. ఎన్నో అనుమానాలు - ప్రశ్నలూ సమయసందర్భాలకు తలవంచి అణగిపోయాయి. తిన్నగా డ్రాయింగ్ రూంకి వచ్చి కూర్చున్నాను. గోడగడియారం చేస్తున్న చప్పుడు తప్పిస్తే గదంతా నిశ్శబ్దంగా వుంది. కేశవరావు నాకేసి వోమాటు తీక్షణంగా చూసి నవ్వాడు.

'నిన్న సాయంత్రం వచ్చాడు. తిన్నగా రాజమండ్రి నుంచి వస్తున్నాడట -మిమ్మల్ని నిన్ననే పిలుద్దామనుకున్నాను. కాని అతనే వద్దని వారించాడు. ఎందుకో మిమ్మల్ని చూట్టానికి భయపడుతున్నాడు. ఎదురుగా వున్న గోడకేసి చూశాను. శ్రీకృష్ణుడు విజయుడికి గీతా రహస్యం బోధిస్తున్న ఘట్టం చిత్రింపబడి వుంది. అదేరీతిలో సుందరానికి హితబోధ చేశాను.'

కామాక్షి గ్లాసునిండా చిక్కటికాఫీ తీసుకొచ్చి నాముందర వుంచింది. కళ్ళను నమ్మలేకపోయాను.

'ఆ!... కామాక్షి ఎప్పుడు వచ్చింది ?'

'నెలరోజులు దాటుతుంది. మీకు మొదట్లో ఆ విషయం చెబుదామనుకున్నాను. కాని గడచిన కాలపు సంఘటనలతో మీరు వృధాగా బాధపడతారని వూరుకున్నాను, మీరేవీ అనుకోకండి.'

అతని కంఠంలో క్షమాపణ ధ్వనించింది.

రుక్మిణి అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. ఆమెలో రేగుతున్న అశాంతిని నేను అర్థం చేసుకోగలను.

'సుందరం వున్న ఉద్యోగానికి రాజీనామా యిచ్చి ట్రావెలింగ్ ఏజెన్సీ తీసుకున్నాడట- వారానికోమాటు ఇంటి ముఖం చూసేవాడట - కామాక్షికి విరక్తి పుట్టింది గాబోలు- ఇక్కడకు వస్తానంది. రుక్మిణికూడా రమ్మని వుత్తరం రాయమంది. ఆమె య్కిడకు వచ్చాక అతనికి రెండు మూడుత్తరాలు రాశాను. అవన్నీ నాకే తిరిగి వచ్చాయి. అతని జాడ ఏవీ తెలియదు. ఏజెన్సీ పని మీద వూళ్ళమ్మటపడి తిరగటం వలన ఆరోగ్యం చెడిపోయిందన్నాడు'.

'ఉన్న ఉద్యోగం ఎందుకు వదలుకున్నాడు?'

చేతిలో వెన్నవుంచుకొని నెయ్యికోసం వూరంతా తిరిగినట్టు సుందరాన్ని బాగా తెలిసివుండికూడా ఆ ప్రశ్న వేయటం తెలివితక్కువే -

'అదే సమాధానం రాని ప్రశ్న - అతనికీ, మేనేజరుకూ ఏవో మనస్పర్థలు వచ్చాయట - తప్పని సరైందట -'

'సరే !... తరువాత చూసుకుందాం, కామాక్షిని పంపండి, మందిస్తాను. రేపు వుదయానికి తగ్గుముఖం పడుతుంది.'

కామాక్షి వెనకాల సీట్లో కూర్చుంది. కారు బయలుదేరింది. చీకట్లోనుంచి వెలుగులోకి

గాబోలు ! ఆమెను ఎన్నో అడగాలనుకునే రమ్మన్నాను. కాని నాలుకదాకా వచ్చిన మాటలు జన్మస్థానాన్ని వెదుక్కుంటూ తిరిగిపోయాయి. ఏదో అగ్నిజ్వాలముందు నిలబడినట్టు భయం.

పావుగంటలో ఇల్లు చేరుకున్నాం. డిస్పెన్సరీ తెరిచి మందు కలిపిచ్చాను.

'కామాక్షి !...చాలా చిక్కిపోయావు సుమా ! అసలు నువ్వీ వూరు వచ్చినట్టే తెలియదు. చూడ్డానికి వచ్చేదాన్ని... ఈ మధ్య జబ్బు పడ్డావా ఏం?' అని కుశలప్రశ్నల రీతిలో సాగించింది సుజాత - ఆమెకేసి చూశాను, జ్యోతుల్లో వెలుగు తగ్గింది. చందమామ పేలవంగా నవ్వాడు. ఎర్రగావున్న పువ్వులు మాధుర్యాన్ని కోల్పోయి వాడిపోతున్నాయి. ఇద్దర్నీ ఏకాంతంగా మాట్లాడుకోనిచ్చి మేడమీదికి వెళ్ళిపోయాను. వాళ్ళు ఏం మాట్లాడుకున్నదీ నాకు తెలియదు. పదినిమిషాలు గడిచాక కామాక్షి సన్నగా ఏడవటం వినిపించింది. ఏదో తప్పిదం చేసినట్టు బాధపడ్డాను- ఓదారుద్దామని నాలుగైదు సార్లు చివరి మెట్టు వరకూ వచ్చి తిరిగి వెళ్ళిపోయాను.

నాన్నగారూ ! కామాక్షి వెడుతుందిట - ' అనరిచింది సుజాత.

'కార్లో వెళ్ళు - రేపుదయం ఎలా వున్నదీ ఫోన్ చెయ్యమను. అవసరమైతే వస్తాను' అన్నాను. ఆమె నమస్కరించి కదిలిపోయింది.

'అమ్మాయి ! కామాక్షి ఎందుకేడుస్తోంది ?'

'అంతా, తన సంసారపు గొడవలు చెప్పుకునే- ప్రతి మనిషీ కొన్ని కలలు కంటాడుట - అవి యధార్థం కాకపోతే ఏడుపే మిగులుతుంది... అయినా నాన్నగారూ ! ఈ విషయంలో మీరెందుకు తలదూర్చారు ? ఎవరి ప్రాప్తం వారిదని వూరుకోవలసింది' తలవంచుకున్నాను. సుజాత కూడా నన్ను నిలదీసి అడిగింది.

స్త్రీలకూ, రహస్యాలకూ శత్రుత్వం వుంది. కామాక్షి తన వ్యథలు సుజాతతో చెప్పుకుందంటే ఆశ్చర్యం లేదు. కాని నేనే అడిగి వుంటే సరైన జవాబు రాకపోయేదేమో!... అద్దంలో ముఖం కనిపించింది. కళ్ళల్లో రెండు నీటి చుక్కలు. అవును. అపనిందంతా నా తలమీద వేసుకున్నాను.

అయిదారు సంవత్సరాలక్రితం సుందరం బి.ఏ. సీనియర్ చదివేవాడు. ఇంటి కెదురుగా వుండటం వలన అతన్ని పరిశీలించే అవకాశం దొరికింది. భవిష్యత్తులోకి తొంగిచూసే శక్తి వుందేమో కాని షార్టు హ్యాండు, టైప్‌రైటింగ్ నేర్చుకోటం మొదలు పెట్టాడు. కేవలం బి.ఏ. చదవటం నేతిబీరకాయ లాంటిదని ఉపమానాలలో వర్ణించి చెప్పేవాడు. అంతవరకూ బాగానే వుంది. కాని నెలకు పట్టుమని పదిరోజులైనా క్లాసుకు వెళ్ళేవాడుకాడు. కారణమేమిటని ప్రశ్నిస్తే చిత్రమైన సమాధానాలు చెబుతాడు. ఓ నాడు వంట్లో బాగాలేదంటాడు. మరోనాడు నిద్రనుంచి మేల్కొనేసరికే ఏడైందంటాడు. చివరకు, అతని జవాబులు విని విని, అలసిపోయి నేను చేసుకున్న నిర్ణయం యిది. అతను వాస్తవిక పరిస్థితుల్ని ఎదుర్కోలేక తప్పించుకోటానికి తన చుట్టూ ఇనుపకోటలు సృష్టించుకుని,

ఏవేవో కలలు కంటూ ఊహా ప్రపంచంలో- గాలిలో వ్రేలాడుతున్న స్వర్గంలో విహరిస్తూ కాలం గడుపుతూ తన్నుతాను మోసం చేసుకుంటున్నాడని. తన చర్యల్ని సమర్థించుకోటానికి అతను కల్పించుకునే కారణాలు విచిత్రంగా వుంటాయి. పరీక్షలు దగ్గర కొస్తున్నా అతను ఏమీ చదివేవాడు కాడు. అర్థరాత్రి సినిమారోడ్డుదగ్గర నిలబడి ఆకాశంకేసి చూస్తూ ఏదో ఆలోచిస్తూ ఖగోళ శాస్త్రజ్ఞుడులా నిలబడేవాడు.

'ఏవయ్యా ! ఏవిటిది ! ఇలా బాధ్యత గుర్తించకుండా చదువూ సంధ్యా లేకుండా తిరుగుతున్నావు?' అనడిగాను.

'ఏం చెయ్యనండి ! పక్కింట్లో వున్న ఆ విధవరాలు సంగతి మీకు బాగా తెలుసుగా ! ఆమె వుదయం నాలుగు గంటల నుండి, రాత్రి పదకొండు వరకూ అరుస్తూ సణుగుతూ, ఎవరెవర్నో తిట్టిపోస్తూ కాలం గడుపుతోంది. ఇంక చదువుమీద నాకెలా శ్రద్ధ కలుగుతుంది చెప్పండి !'

అదీ అతని సమాధానం - దాన్ని ఏ విధంగా ఖండించాలో కూడా తెలియదు. ఇది కేవలం 'ఎస్కేపిజం' అయితే ఎంతకాలం యిలా తప్పించుకు తిరగ్గలడని ?

అతని తెలివితేటలు అడవి కాచిన వెన్నెలలా వృధా కావటం నన్నెంతో బాధించింది. ఏ మానవుడూ పుట్టుకతోనే నిశ్చితమైన మనస్తత్వం కలిగి వుండడని, అతని చుట్టూ వున్న వాతావరణమే మంచిచెడ్డలు, గుణగణాలు నేర్పుతుందని అంగీకరించినప్పుడు, ఆ మనస్తత్వాన్ని తగిన రీతిలో మార్చటంకూడా మన చేతిలో వుందని అంగీకరించాలి. అడవిలో మదించి తిరుగుతున్న ఏనుగును పట్టి తీసుకొచ్చి సరైన మార్గంలో తరిఫీదు చేశాక మానవజాతికి ఎంతో ఉపకారం చేస్తోంది. దొంగను, హంతకుడిని ప్రయాసకోర్చి సరిదిద్దటం గగన కుసుమం కాదు. అయితే ఈ మార్పుకు చాలా సమస్యల్ని ఎదుర్కొని ధైర్యంగా నిలబడవలసి వుంది. ఇలాంటి ఆలోచనలే నన్ను చుట్టుముట్టాయి. సుందరాన్ని సరైన మార్గంలో వుంచేవారుంటే అతను బాగుపడతాడని నిర్ణయించుకున్నాను.

కామాక్షి తండ్రికి నా మీద గౌరవం వుంది. చాలా విషయాల్లో అతను నా సలహా తీసుకునేవాడు. రుక్మిణిపెళ్ళి అయిందనిపించేసరికి అతని తలప్రాణం తోకకొచ్చింది. రెండో కూతురు పెళ్ళి జరిపించటమెలాగన్న దిగులు అతన్ని వేధించసాగింది.

కామాక్షి తెలివైంది. స్కూలు ఫైనలు వరకూ చదువుకుంది. ఎక్కడో ఆకాశంలో దాగి వున్న రహస్యాల్ని శోధిస్తున్నట్టు తీక్షణమైనకళ్ళు, శిఖరం మీద నిలబడి అఖాతాన్ని వెక్కిరిస్తున్నట్లు చిరునవ్వు -

నాముందు రెండుశక్తులు నిలబడి వున్నాయి. ఒకటి సూర్య చంద్రగోళాల్లో వుండగలిగిన రహస్యాల్ని సహితం శోధించకలిగింది. రెండోది అణుశక్తి తనలో వున్నా సద్వినియోగం చేసుకోలేక తాడు తెగిన గాలిపటంలా ఎగురుతున్నది. రెండింటినీ పరిశీలించాక, సుందరానికీ, కామాక్షికీ పెళ్ళి జరిగి తీరాలని నిశ్చయించుకున్నాను.

ఆ మర్నాడే సుందరం మావయ్యతో ఈ విషయం కదిపాను. ఆ సమయానికి

కేశవరావు ఆ వూళ్ళోనే వున్నాడు. కామాక్షి తండ్రి సుందరాన్ని గురించి దర్యాప్తు చేసి పెదవి విరిచాడు. అతనికి ఆస్తి లేదు. వుద్యోగం లేదు. స్థిరత్వం లేదు. గాలి ఏ దెసగా వీస్తే పడవ కూడా ఆ దెసగా పరుగెడుతుంది. సుందరం మావయ్య కొంత కట్నం యివ్వనిదే పెళ్ళి జరగటానికి వీల్లేదన్నాడు. అది సమంజసమేననిపించింది. సుందరం థర్డుఫారం చదువుతుంటే అతని తల్లిదండ్రులు ఒకరి తరువాత మరొకరు కన్నుమూశారు. అతన్ని ఆదరించి చదివించింది మావయ్యే - ప్రతిఫలం కోరటంలో తప్పేముంది ? సుందరం ప్రకృతిని బాగా అర్థంచేసుకున్న వారెవరూ అతను యీ పరిస్థితుల్లో, ఇలా యిలా ప్రవర్తిస్తాడు అని సిద్ధాంతీకరించలేరు. పెళ్ళై విడిపోయాక మావయ్య రుణం తీర్చుకుంటాడని నమ్మకమేమిటి ?... చివరకు అందర్నీ ఒప్పించి శుభకార్యం పూర్తయిం దనిపించేవరకూ నాకు నిద్రపట్టలేదు. బి.ఏ. పూర్తికాగానే సుందరానికి మంచి ఉద్యోగం దొరికింది. కామాక్షిని వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడు. మానవజీవితాల మీద కొనసాగిస్తున్న ఈ ప్రయోగం ఎంతవరకూ విజయవంతమవుతుందో !

కాని-

నా సిద్ధాంతాలు కేవలం వూహా మాత్రమైనవని కాలం నిరూపించసాగింది. ఎంతగానో గౌరవించి ప్రేమించిన సుజాత కూడా నన్ను నిలదీసి అడిగేసింది. ఏడాది గడిచాక నేను టౌన్‌లో ప్రాక్టీసుపెట్టాను. ఆ వూళ్ళోనే కేశవరావు స్టేట్‌బాంక్‌లో పనిచేస్తున్నాడు. కామాక్షిని గురించిన వార్తలు అప్పుడప్పుడు చెవిన వేస్తుండేవాడు.

ఓనాడు ఆమె వ్రాసిన ఉత్తరం చదివి వినిపించాడు.

'ఈ మధ్య నేను జీవితానికి రెండు ప్రక్కలు వున్నాయని అర్థం చేసుకున్నాను. ఒక మనిషి మరోమనిషి మీద ఆధారపడటం కాని -ఒకర్ని చూసి జడుసుకుని తన స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను న్యాయబద్ధమైన వాంఛల్ని అణుచుకుని బ్రతకటం గాని ఎంత తెలివితక్కువ ! ఈ మధ్య మధ్యాహ్నం పూట టైప్ రైటింగ్ నేర్చుకుంటున్నా !....

ఆ తరువాత అతనేం చదివింది నాకు తెలియదు.

నాలో నేనే అనుకున్నా: 'అయితే అతను మారలేదు.'

ఒకవ్యక్తి తన్నుతాను అసహ్యించుకున్నాడంటే, నిరాశావాద ధోరణిలో పడ్డాడంటే ఆ వ్యక్తిలో ఏదో లోపం వుందన్నమాట !

కిటికీలోంచి రివ్వున ఓ గాలికెరటం, లోపలకు ప్రవేశించింది. టేబిలుమీదున్న కాగితాలు ఎగిరిపోయాయి. అవి ఎంతదూరం వెళ్ళగలవని వెనక్కి తిరిగి చూశాను. సుజాత అవన్నీ తీసుకొచ్చి తిరిగి టేబిల్ మీద వుంచింది.

నేను సైకాలజీ గురించి వ్రాస్తున్న పుస్తకం తాలూకు పేజీలు అవన్నీ, వివిధ మనస్తత్వ శాస్త్రజ్ఞులు వ్రాసిన విషయాల్ని ఒక చోట చేర్చి, నేను గడించిన అనుభవాన్ని ఆధారంగా చేసుకుని కొన్ని క్రొత్తసంగతులు ప్రతిపాదించాలని నేను చేస్తున్న నిరంతరకృషి సుందరం గుర్తుకు రాగానే ఉద్రేకంలో ఆ పేజీలన్నిటినీ చించి వేశాను. ఆరేళ్ళ కాలపరిమితిలో ఒక

వ్యక్తిని అర్థం చేసుకోలేని నేను ఓ బ్రహ్మాండమైన పుస్తకం వ్రాసి లోకాన్ని మోసగించటానికి ప్రయత్నించటం హాస్యాస్పదం! - 'నాన్నగారూ' ఒంటిగంట కావస్తుంది. పడుకోండి' అంది సుజాత.

మర్నాడు ఉదయం లేవగానే మొహమైనా కడుక్కోకుండా 'సుజాతా ! ఏమైనా కాల్ వచ్చిందా?' అనడిగాను.

కేశవరావుగారు ఫోన్ చేశారు. సుందరానికి జ్వరం నార్మలుకు వచ్చిందట - మీరు రానవసరం లేదన్నాడు.

నాలుగైదు రోజులు గడిచిపోయాయి. ప్రతి క్షణం ఓ యుగంలా -కొన్ని టన్నుల బరువును మోస్తున్నట్టు బాధపడుతూ గడిపాను. కేశవరావు వస్తాడనుకున్నాను - రాలేదు. కనీసం ఫోన్ చెయ్యనైనా లేదు, 'ఒకరి కర్మకు మరొకరు బాధ్యులు కార'ని విశ్వసించే అతను కూడా ఈ విషాదమంతా నేనే కలిగిస్తున్నానని అసహ్యించుకుంటున్నాడు. కామాక్షి జీవితం యిలా వికసింపని పుష్పంలా తయారవుతుందని నాకుమాత్రం ముందుగా ఏం తెలుసు ? ఆ సాయంత్రం ఇంటికి రాగానే సుజాత రెండువిషయాలు చెప్పింది.

'మధ్యాహ్నం మీ కోసం ఎవరో స్నేహితుడు వచ్చాడు. మళ్ళీ సాయంత్రం వస్తానన్నాడు. అరగంట క్రితం తను వస్తున్నానని సుందరం ఫోన్ చేశాడు'.

రెండో వార్త కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించింది.

మరో అరగంటకు ఆ స్నేహితుడు రానే వచ్చాడు. అతని పేరు కైలాసం - సుందరం, అతనూ ఒకే కంపెనీలో పనిచేసేవారు. మావయ్య కొడుక్కి పెళ్ళిట, అందుకని వచ్చాడు.

స్నేహధర్మం పాటించి, ఓ మారు చూసి పోదామని వచ్చాడు. 'అన్నట్టు సుందరం మా కంపెనీలో ఉద్యోగానికి విడాకులిచ్చి వెళ్ళిపోయాడు. ఆ సంగతి మీకు తెలుసా ? అతను ప్రస్తుతం ఎక్కడ వున్నదీ కూడా తెలియదు.'

సుజాత రేడియో వింటున్నట్టు నటిస్తూ మా సంభాషణవైపే ధ్యానాన్ని కేంద్రీకరించింది.

'అతను యిక్కడే నిరుద్యోగిగా వున్నాడు. చూడు కైలాసం !.. నువ్వు తెలివైనవాడివి. పరిస్థితుల్ని అర్థం చేసుకోటంలో నీకు సూక్ష్మబుద్ధి వుంది.'

'పెద్దపీఠికే వేస్తున్నారు !' అంటూ అడ్డం తగిలాడు.

'సుందరం చిత్రమైన మనిషని నువ్వుకూడా గ్రహించి వుంటావు. అతన్ని గురించి నువ్వు చేసిన రిసెర్చ్ ఏమిటి ?'

'డాక్టరుగారూ ! ముసుగులో గుద్దులాట ఎందుకు ? అంతా వివరిస్తాను-'

సుజాత వంక చూశాను. సగం పూర్తయిన సైకాలజీ పుస్తకాన్ని అక్కడక్కడా చదువుతోంది.

'అతనూ, నేను చాలా దగ్గర స్నేహితులం. తన వ్యక్తిగత విషయాలు అనేకం నాతో

చెప్పుకుని ఏడ్చేవాడు. కాని చిత్రంఒక్కటే! ఒకనాడు చెప్పిన అభిప్రాయానికి, మర్నాటిదానికీ ఎక్కడా సంబంధం వుండదు. తను చదువుకున్న అమ్మాయిని చేసుకోవాలనుకున్నాడని, మీరు ఆలోచించుకోనివ్వకుండా ఎవతెనో మెడకు తగిలించారన్నాడు. పెళ్ళిచేసుకోటం పెద్ద పొరపాటంటాడు. దాని మూలంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నశించిపోతాయి. బానిసకంటె హీనం బతుకుతున్నాడట-'

'అంటే ఎంతవరకూ చదువుకుని వుండాలని అతని వుద్దేశం' అనడిగింది సుజాత-

'అది నాకు తెలియదు. మొత్తాని కతనికి సంసారజీవితం కరక్కాయ నములుతున్నట్టే వుంది. చెప్పాలంటే భారతమంతకథ వుంది. మా కంపెనీ మేనేజరుగారమ్మాయి అప్పుడప్పుడు ఆఫీసుకు వస్తూండేది. అతన్తో మాట్లాడుతుంది. మరొకరివంక కన్నెత్తి అయినా చూడదు. ఇదంతా గమనిస్తున్న ఆఫీసు సిబ్బంది పుకార్ల మీద పుకార్లు లేవదీసింది. కొందరు వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారన్నారు. సుందరంతాలూకు తెలివితేటలు, అందచందాలు ఎవర్నైనా ఆకర్షిస్తాయని సిద్ధాంతీకరించారు. ఓ నాడు సుందరాన్ని పిలిచి మందలించి జాగ్రత్తగా మసలుకోమన్నాను. అంతవరకూ వస్తే ఆమెను చేసుకోటానికి సిద్ధమేనన్నాడు - ప్రస్తుతం వున్న పెళ్ళాన్ని తనుకోరి చేసుకోలేదని, ఆమెకు విడాకు లివ్వటంలో ఎంతమాత్రం పొరపాటులేదని వాదించాడు. అంతపని చేస్తాడనే నా భయం. అతన్ని విశ్వసించలేం. ఉన్నట్టుండి మేనేజరుకూ అతనికి ఓనాడు పెద్ద వాగ్వివాదం జరిగింది. మాటలు గౌరవ మర్యాదల్ని అధిగమించి దొర్లిపోయాయి. మరుక్షణం రాజీనామా కాగితం అతనిముందు విసిరేశాడు. మేనేజరుగదికి పక్కనే వున్న గుమాస్తా, దానికంతకూ కారణం అతని దుష్ప్రవర్తనేనని మేనేజరుగారమ్మాయి పేరు నాలుగైదుసార్లు దొర్లిందని అన్నాడు. దాంట్లో ఎంతవరకు నిజం వుందో తెలియదు మరి-' సుజాత రేడియో కట్టేసి మా కెదురుగావున్న కుర్చీలో కూర్చుంది. 'తరువాత ఏదో ఏజన్సీ తీసుకున్నాడు. పది రోజులు పోయాక అదికూడా వదిలేశాడు. అంతేకాదండోయ్! సింహాచలం కొండలమీద పదిహేనురోజులు గడిపాడట- ఎందుకని అడిగాను- ఏకాంతంలో తియ్యదనం ఎలా వుంటుందో రుచి చూడాలనుకున్నాడట - అందుకని, అందరికీ దూరంగా వుండాలని ఈ ప్రయోగాలు చేస్తున్నాడు.

'అక్కడైనా సుఖం దొరికిందా?'

'అదే లేదంటాడు. ఇంక సన్యాసం పుచ్చుకుని చూడాలని వుందట - ఏ,దగ్గర్నుంచి, జడ్ వరకూ వున్న ఉద్యోగాలు చూడటం పూర్తయింది. ఇంక మిగిలేదేముంది?'

'వట్టి అబద్ధాలకోరు' అంటూ పళ్ళు పటపట కొరికింది. కామాక్షి నిలిపిన కన్నీరు ఆమెలో ఇంకా ఇంకిపోలేదు. స్త్రీలకు సహజంగా వారి జాతిమీద సానుభూతి వుంటుంది.

'అమ్మాయి ! అదే పొరపాటు ! అతను అబద్ధాలు చెప్పడం లేదు. స్వలాభం కోసం నిజాన్ని కప్పిపుచ్చి చెప్పేదే అబద్ధం - అతని ఆలోచనలు అలాంటివి'

'చాలు నాన్నగారూ ! మీ నిర్వచనాలు పుస్తకాల్లో వ్రాసుకోండి ; ప్రచురించండి ; వేలకు

వేలు కాపీలు అమ్మండి ; అంతేకానీ అమాయిక జీవుల మీద రుద్దకండి.'

సుజాత లాజిక్ చదవటం తప్పేమోననిపించింది.

సుందరాన్ని కాషాయవస్త్రంలో, కమండలం పాదరక్షలతో సన్యాసిగా వూహించాను. తల గిర్రున తిరిగింది.

'నేను వస్తానండి. కొత్త వూరు కనక వాళ్ళు ఆలస్యమైతే నా కోసం కంగారు పడతారు' అంటూ అతను నమస్కరించి వెళ్ళిపోయాడు.

'అయితే నాన్నగారూ ! అంతా విన్నారు కదా ! ఏవంటారు?'

సమాధానం చెప్పాలనుకున్నాను. మాటలకంటే ఆలోచన లోతైనది. మనం తెలుసుకున్న విషయాలు ఇతరులకు చెప్పలేం- మనిషిని మనిషి పూర్తిగా అర్థం చేసుకోలేడు. వ్యాధి చిహ్నాన్ని బట్టి వ్యాధిని నిర్ణయించినట్టు, ప్రవర్తనను బట్టి మనస్తత్వాన్ని నిర్ణయించవలసి వుంటుంది. అలా నిర్ణయించినా దానికి స్థిరమైన రూపం వుండకపోవచ్చును. ఆత్మలోవున్న భావాల్ని తరచిచూడగల యంత్రం వుంటే ? ఒక కాలంలో దివ్యంగా ప్రకాశించిన భవనంతాలూకు స్తంభాలు - మిగిలిన అస్తి పంజరాలు - పురోగమనమో - తిరోగమనమో అర్థం కాదు. అంతా స్వప్న సమానం. కాకపోతే ఏవిటీ వేదాంతం ! నీటి చుక్కలు సముద్రంలో కలుసుకుంటాయి. కాని కలిసి ప్రయాణం చేస్తున్న విభిన్న హృదయాలు ఎక్కడ కలుసుకుంటాయి?

'సుజాతా! నీకు వేళాకోళంగానే వుంటుంది. అయినా చెప్తాను. సుందరం జీవించటం మానుకొని జీవితాన్ని గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు. అదే అతను చేసిన మొదటి పొరపాటు. నలుగురితో కలిసిమెలిసి తిరుగుతూ వాళ్ళ అభిరుచుల్లో భాగం పంచుకుని అందులో వుండే తియ్యదనాన్ని ఆస్వాదించగల్గిన వ్యక్తి మందలో మేకలా- వెయ్యి కెరటాల్లో ఓ కెరటంలా కాలం గడిపేస్తాడు. అతన్లో అసంతృప్తి - మూగవాంఛలు - చీకట్లో చేతులు అటూ యిటూ వూగించటం- వుండవు- సుందరం అందుకు విభిన్నమైన వాడు కాడు. కామాక్షి అతణ్ణి సరిదిద్దుతుందనుకున్నాను. కాని కామాక్షి కూడా అలాంటిదేమోనన్న భయం కలుగుతోంది. రెండు సమానాంతర రేఖలు ఎక్కడా కలుసుకోవు.'

సుజాత నన్ను హేళన చేస్తూ ఫక్కున నవ్వింది.

'ఎందుకు కలుసుకోవు? ఇన్ఫినిటీలో కలుసుకుంటాయని మీ శాస్త్రం ప్రతిపాదిస్తోందిగా!'

తలుపు కిర్రుమంది. సుందరం వచ్చి నమస్కరించాడు.

వ్రాస్తున్న పేజీలను ఓ మూల వుంచి ఎదురుగా కూర్చోమన్నాను.

'ఏమోయ్! కులాసాగా వున్నావా? ఏవిటి సంగతి ?'

అతను నాలుగైదు నిమిషాలు తలవంచుకుని కూర్చున్నాడు. అతనికి నేనంటే

భయమని కేశవరావు ముందే చెప్పాడు.

'డాక్టరుగారూ ! మీరు నన్ను క్షమించాలి' అంటూ ప్రారంభించి రెండేళ్ళ తన జీవితక్రమాన్నంతా మామూలు ధోరణిలో వర్ణించాడు. అంతా వింటూ కూర్చున్నాను. చివరకు, తన తప్పేమీ లేదని, అంతా పరిస్థితుల ప్రభావమని తేల్చాడు. ఖూనీచేసి 'అలా చేయమని నా నెత్తిన రాసివుంటే దాన్ని మార్చటం ఎవరితరం?' అన్నట్టుగా వుంది.

అతనికి మళ్ళీ హితబోధ చేయనారంభించాను, మౌనంగా విన్నాడు. 'డాక్టరుగారూ ! నా ప్రవర్తనకు సిగ్గుపడుతున్నా- గడచినదంతా మర్చిపొండి- ఇక ముందు బుద్ధిగా నడుచుకుంటాను. ఓ ఉద్యోగం చూపెట్టండి అదే చాలు !' అంటూ వెక్కి వెక్కి ఏడవనారంభించాడు.

టెలిఫోన్ గణగణమంది.

అవతలనుండి నా మిత్రుడొకడు మాట్లాడాడు.

'మా కంపెనీలో టైపిస్టు కావాలి. మీరు ఇదివరకు ఏవైనా ఖాళీలు వుంటే చెప్పమన్నారు కదా - అందుకని తెలియజేస్తున్నా- ఇప్పటికే డజనుమంది ఇంటర్వ్యూకి వచ్చారు. మీ తాలూకు ఎవరైనా వుంటే రేపు పన్నెండుగంటలలోగా రమ్మనండి. ఆ తరువాత నేనేం చెయ్యలేను'.

వెదుకుతున్న తీగ కాళ్ళకుచుట్టుకున్నట్టయింది. ఆయన్ని అభినందించి రేపు ఉదయం ఓ టైపిస్టును పంపిస్తానన్నాను.

సుందరం సంగతులు తెలుసుకొని సంతోషించాడు. అడ్రసు వ్రాసుకున్నాడు. నాకెదురుగా కూర్చొని అప్లికేషన్ వ్రాశాడు.

కృతజ్ఞత చెప్పి వెళ్ళిపోయాడు. సుందరం మారాడు.

కాని అతన్ని మార్చింది కామాక్షి కాదు.

ఆ రాత్రి తృప్తిగా నిద్రపోయాను.

మర్నాడు మధ్యాహ్నం ఒంటిగంటకు కంపెనీ మేనేజరుకు ఫోన్ చేస్తే సుందరం అక్కడకు వెళ్ళలేదని తేలింది. కేశవరావుకు ఫోన్ చేశాను.

'సుందరం నిన్న సాయంత్రం ఇల్లు విడిచిపెట్టాడు. మళ్ళీ తిరిగి రాలేదు. అతను వస్తాడని నమ్మకం నాకు లేదు. మీ అభిప్రాయం అడగటం కూడా నాకిష్టం లేదు. జరిగింది జరిగిపోయింది. నల్లకుక్కను గంగలో ముంచితే మాత్రం గోరూపం వస్తుందా ? పాపం, కామాక్షిని గురించి మీరు బాధపడకండి. ఆమె తన బ్రతుకుతెరువు తను చూసుకుంటుంది. నమస్తే!'

'నీకూ నాకూ సంబంధం నాస్తి' అన్నట్టు సమాధానం !

అతనికోసం ఎక్కడని వెతకను ? మళ్ళీ పలాయనం చిత్తగించి వుంటాడు. ఎప్పుడైనా వస్తాడు. కన్నీరు కారుస్తాడు. ఆ మర్నాడే అదృశ్యమవుతాడు ! ఛీ ! ఇంతకంటే అతను

బలవంతంగా చేస్తేనే బాగుండుననిపించింది. ఈ పారుబోతుతత్వం మొదట్నుంచీ వేళ్ళు పాతుకుపోయి అతన్ని ముంచివేసింది. ఇంక దాన్ని సరిదిద్దటం ఎవరి తరమూ కాదు... గబగబా వెళ్ళి సగం పూర్తయిన పుస్తకం తాలూకు పేజీలన్నీ ఒక్కొక్కటే చిన్న చిన్న ముక్కలుగా చించి వేశాను. చిత్తుకాగితాలబుట్ట నిండిపోయింది. వికటంగా ఓ మారు నవ్వుకున్నాను. అవును - ఓటమి - సిద్ధాంతాల సమన్వయంలో ఓటమి; ఏడ్లర్ - బ్రౌన్ - రొస్సెల్ - వీళ్ళందరూ ఏంసాధించారో నాకు తెలియదు. కాని నేనుమాత్రం చీకటి కోణంలోకి విసిరివేయబడ్డాను.

మహాసముద్రాన్ని సురక్షితంగా యీదేసి అవతలిగట్టు చేరుకోవాలని సంకల్పం. కబళించటానికి ఎగిరిపడుతున్న అలలు ఎదుర్కోకూడదు. సుడిగుండాలు వుండకూడదు. అనుమానం- అందరాని పండుకోసం ఆకాశపుటంచులు అందే వరకూ ఎగరటం, కామాక్షిని సుందరం అసహ్యించుకోవటానికి కారణాలుగా ఊహించవచ్చు. ఒక వ్యక్తిని మరో వ్యక్తి ద్వేషించటానికి స్వల్పవిషయాలు చాలు. కామాక్షి అనుసరించిన నిశ్చల సంప్రదాయాలకూ, క్షణక్షణానికి రంగులు మార్చుకుంటున్న అతని ప్రవర్తనకూ పొత్తు కుదరదేమో-కామాక్షి భర్తను దైవంగా పూజిస్తే అతను ప్రేమదేవతగా స్వేచ్ఛ ప్రకటించమన్నాడేమో!

అయిదారురోజులు గడిచాక ఓ మిత్రుడికి వీడ్కోలివ్వటానికి స్టేషనుకు వెళ్ళాను. అక్కడ కైలాసం కనిపించాడు. రైలు కదులుతుంటే మాముందునుంచే గబగబా ఓ సన్యాసి పరుగెత్తుకెళ్ళి కంపార్టుమెంటులో జొరబడ్డాడు. సుందరం ! సుందరం అంటూ పరుగెడుతున్న రైలుతో వెర్రిగా అరుస్తూ పరుగెత్తాను. రైలు మాత్రం ముఖం చిట్లించి పెద్దగా అరచి పొగలో ముంచివేసి దూరంగా వెళ్ళిపోయింది.

అయితే ఇంక కామాక్షి ఆత్మహత్య చేసుకుంటుంది.

'కైలాసం ! చూశావా ! సుందరం సన్యాసం పుచ్చుకున్నాడు. ఆ నాడు హాస్యానికన్నమాట నిజమైంది.'

'అబ్బే ! అతను సుందరంకాడండి' అతనెవరో నేను జాగ్రత్తగా చూశాను. మీరు పొరబడ్డారు.'

'కాదు....కాదు...నేను సరిగ్గా చూశాను. నాకళ్ళు నన్ను మోసగించలేవు' అనరిచాను ఆవేశంతో. కామాక్షిని గురించి ఆలోచించలేకపోయాను.

'అబ్బే!... మీకు మతిభ్రమించి వుండాలి... అయ్యో ! ఏవిటిది !' అనరిచాడు కైలాసం.

తలగిరగిరా తిరిగింది. కళ్ళు చీకట్లు కమ్మాయి.

రైలు చక్రాల కింద!....అయ్యో....ఆ తరువాత ఏం జరిగిందీ నాకు తెలియదు.

జనవరి 1958 (భారతి)

*